

నాటి ప్రాభవం కానరాదేమీ?

ఖమ్మంలోని టీటీడీసీ భవనం మూడేళ్లుగా నిరాదరణకు గురవుతోంది. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతోంది. 8లో



ముగిసిన జిల్లాస్థాయి సీఎం కప్

జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 26°

వాతావరణం

జిల్లాలో గురువారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. మధ్యాహ్నం మరింత తీవ్రమై వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శిక్షణ తరగతుల్లో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ రకాల పోటీ పరీక్షల శిక్షణ తరగతుల్లో బోధించడానికి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు జరిగే ఉచిత శిక్షణలో అర్థమెటిక్, రీజనింగ్, అర్థశాస్త్రం, సోషియాలజీ, జాగ్రఫీ, భారత–తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమ చరిత్ర, ఆంగ్లం, భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాల్లో బోధించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి గలవారు ఈ నెల 29 లోగా tssc.kmm2017@gmail.com కు దరఖాస్తు చేసుకోవాలని, లేదంటే టీఎస్ఎస్సీ స్టడీ సర్కిల్ రాపర్తినగర్‌లో అందజేయాలని సూచించారు. పీజీలో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండి, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9848494290, 9515730477 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి 9వ సీనియర్ అథ్లెటిక్స్ మీట్ గురువారం ప్రారంభం కానుంది. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 300 మందికి పైగా అథ్లెట్లు హాజరు కానున్నారు. ప్రధానంగా ఈ మీట్‌లో అగ్రశ్రేణి అథ్లెట్లు పాల్గొంటారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేశామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఆయా జిల్లాల నుంచి వచ్చే అథ్లెట్ల కోసం ప్రత్యేకంగా వసతి, భోజన సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. వారికి ఇబ్బంది కలగకుండా స్టేడియంలో ప్రత్యేక ట్రాక్, అథ్లెట్లకు ఇచ్చే బిబ్ నంబర్లు ఏర్పాటు చేశామని వివరించారు. పోటీలకు ముఖ్య అతిథిగా ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి కె.సారంగపాణి హాజరవుతారని తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



వందనంలో చెరువును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

చింతకాని: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ సీఈఓ అప్పారావు తెలిపారు. మండలంలోని వందనం, కొదుమూరు గ్రామాల్లోని చెరువులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యర్థాలతో చెరువుల్లో ఉండే నీరు కలుషితం అవుతోందని, ఆ నీటితో పలు రకాల ఇబ్బందులతో పాటు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అనంతరం వందనం గ్రామంలో నర్సరీని పరిశీలించి ప్రజలకు ఉపయోగపడే మొక్కలను పెంచాలని, ఎండిపోకుండా నీళ్లు పెట్టాలని తెలిపారు. రాఘవాపురంలో ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొరిపల్లి సునీత, నక్కనబోయిన సుజాత, కొండపర్తి గోవిందరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు చెవుల మహేశ్, ఈశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో బుధవారం రామయ్య నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

దిశ.. మారని దశ





ఖమ్మం కలెక్టర్ కార్యాలయం (ఇన్‌సెట్) దిశ కమిటీ సమావేశం (ఫైల్)

మొక్కుబడిగానే సమావేశాలు

- ప్రస్తావించిన సమస్యలపై కంటితుడుపు చర్యలే..
- గైర్హాజరవుతున్న కీలక అధికారులు
- ఎనిమిది నెలల తర్వాత నేడు ముహూర్తం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించాల్సిన దిశ కమిటీ సమావేశాలు మొక్కుబడిగా మారాయి. మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. చివరగా గతేడాది సెప్టెంబర్ 27న సమావేశం నిర్వహించారు. ఇప్పటికి ఎనిమిది నెలలు పూర్తి కావస్తోంది. సమావేశాలు సకాలంలో జరగకపోవడంతో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు, క్షేత్రస్థాయిలో నెలకొన్న ఇబ్బందులపై చర్చించే వీలు లేకుండా పోయింది. గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కేంద్ర నిధుల వాటా ఉన్నందున వాటిపై చర్చించేందుకు ఈ సమావేశాలు కీలకం. గత దిశ కమిటీ సమావేశంలో సభ్యులు, ప్రజాప్రతినిధులు పలు సమస్యలను ప్రస్తావించారు. అయితే వీటిలో కొన్ని మాత్రమే పరిష్కారం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం దిశ కమిటీ సమావేశాన్ని చైర్మన్, ఎంపీ నామ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

'దిశా' నిర్దేశానికి..

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2016లో డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీడీసీఎంసీ) ఏర్పాటైంది. ఈ కమిటీకి 'దిశ' పేరు ఖరారైంది. ఈ కమిటీ సమావేశం మొదట 2016 ఆగస్టు 13న నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతీ ఏప్రిల్, జులై, అక్టోబర్, ఫిబ్రవరి నెలల్లో మూడో శనివారం సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కమిటీకి చైర్మన్‌గా ఎంపీ ఉంటారు. సభ్యులుగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్, జెడ్పీ చైర్మన్లు, నామినేటెడ్ సభ్యులు వ్యవహరిస్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాల అమలుకు సంబంధించిన తీరుతెన్నులను సమీక్షించడంతోపాటు ఆ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని చూడటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్థానిక సంస్థల మధ్య సమన్వయంతో పనులు నిర్వహించేలా దిశా నిర్దేశం చేయడం ఈ కమిటీ ఏర్పాటు ప్రధాన ఉద్దేశం.

పకడ్బందీగా అమలయ్యేలా..

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా అనే అంశాలను ఈ కమిటీ సమీక్షిస్తుంది. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశంలో ఎంత పని జరిగింది.. ఎన్ని నిధులు ఖర్చయ్యాయనేది అధికారులు వివరించాల్సి ఉంటుంది. అలాగే ఆయా శాఖలకు సంబంధించిన ఏ రికార్డులనైనా పరిశీలించే హక్కు కమిటీకి ఉంటుంది. ఏ విషయంపై అయినా విచారణకు ఆదేశించే అధికారం కూడా ఉంది. నిధుల వినియోగంపై కమిటీ పూర్తిస్థాయిలో మానిటరింగ్ చేయొచ్చు. అలాగే సమావేశంలో మొదటగా గత సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలపై ఏం చర్యలు తీసుకున్నారు, చేయాల్సిన పనులు, విచారణలు పూర్తయ్యాయా అనే విషయాలను చర్చిస్తారు. దిశ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను 30 రోజుల్లోగా అమలు చేయాల్సి ఉంటుంది.

సమావేశాలపై పట్టింపేది..

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించాల్సిన దిశ కమిటీ సమావేశాలు తూతూమంత్రంగానే సాగుతున్నాయి. జిల్లాలో దిశ కమిటీ సమావేశాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కొన్ని కీలక శాఖల అధికారులు సమావేశాలకు గైర్హాజరవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన దిశ కమిటీ సమావేశానికి ఇరిగేషన్ సీఈ రాకపోవడంతో ఎంపీ నామ నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు మెమో జారీ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అంతకుముందు సమావేశానికి కూడా పలు శాఖల అధికారులు హాజరు కాలేదు. అసలే సమావేశాలు ఆలస్యం అవుతుండగా జరిగిన సమయంలోనూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో పథకాలపై చర్చించడం ఇబ్బందిగా మారుతోంది. ఇక సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించినప్పటికీ.. పూర్తిస్థాయిలో చర్యలు ఉండటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

నేడు ఐడీవోసీలో సమావేశం..

మూడు నెలలకోసారి దిశ సమావేశం నిర్వహించాల్సి ఉండగా.. ఎనిమిది నెలల తర్వాత గురువారం ఐడీఓసీలో ఏర్పాటు చేస్తున్నారు. నేడు ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించాలని కమిటీ చైర్మన్, ఎంపీ నామ నాగేశ్వరరావు నిర్ణయం తీసుకున్నారు. 23 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 43 అంశాలతో పాటు గతేడాది సూచించిన అంశాల పురోగతిపైనా చర్చించనున్నారు. ఇప్పటికే కమిటీ నామినేటెడ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులకు డీఆర్‌డీఏ అధికారులు సమాచారం అందజేశారు.

చెల్లింపులపై దృష్టి పెట్టండి



వైద్య కళాశాల ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

అధికారులకు కలెక్టర్ గౌతమ్ ఆదేశం

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ స్థలాల్లో నివాసం, వ్యాపార నిర్మాణాలు చేపట్టి రెగ్యులరైజ్ నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు వెంటనే నిర్ణీత రుసుము చెల్లించేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో బుధవారం ఆయన ఐడీఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..జీఓ 59 కింద దరఖాస్తు చేసుకుని నగదు చెల్లించని వారిపై దృష్టి సారించాలని, ఇందుకోసం తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో సందర్శించాలని సూచించారు. స్థలాల క్రమబద్ధీకరణతో సర్వ హక్కులు వస్తాయనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. డిమాండ్ మేరకు చెల్లించి, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. పూర్తిస్థాయిలో చెల్లించినవారికి రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

పెండింగ్ జాబితాలు సమర్పించాలి..

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయం కోసం అందిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే జాబితా పంపించాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ సెక్రటరీల ద్వారా వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చూడాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని, లబ్ధిదారుల కేటాయింపు పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. గ్రామాల్లో నివాసయోగ్యమైన ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు పట్టాల జారీకి చర్యలు చేపట్టాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ ఎ.మధుసూదన్, ట్రైనీ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఆర్వో ఆర్.శిరీష, ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు సత్యనారాయణ, రాంబాబు, వెంకటేశ్వరరావు, డీటీ రంజిత్ పాల్గొన్నారు.

నిర్మాణంలో వేగం పెంచాలి

వైద్య కళాశాల పనులను పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం వైద్యవిభాగం: ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. పాత కలెక్టరేట్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు చేపడుతున్న పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. టీచింగ్ గది, ఫిజియాలజీ ల్యాబ్, హెమటాలజీ ల్యాబ్, బయో కెమిస్ట్రీ, మ్యూజియం, పరిపాలన కార్యాలయం తదితర విభాగాలను పరిశీలించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రికల్, శానిటరీ, డోర్ల ఏర్పాటు పనులు చేయాల్సి ఉందని, రాష్ట్ర దశాబ్ది అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని జూన్ 14న వైద్యానికి సంబంధించి కార్యక్రమం చేపట్టనున్నామని, ఆలోగా పనులన్నీ పూర్తి చేసి, కళాశాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ రోజున వైద్య కళాశాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, విధుల్లో చేరిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల పరిచయ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. అంతకుముందు ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్ వెనుక నిర్మిస్తున్న ఈఎల్ఎస్ఆర్ పనుల పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వర రావు, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు, టీఎస్ఎంఐడీసీ ఈఈ ఉమామహేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, మున్సిపల్ డీఈ నవీన్, ఏఈ హుస్సేన్ పాల్గొన్నారు.

ఎండలతో బెంబేలు..



ఎండ తీవ్రతతో జనసంచారం అంతగా లేని ఖమ్మం బైపాస్ రోడ్డు

- నేలకొండపల్లిలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత
- నేటి నుంచి రోహిణి కార్తె

ఖమ్మంవ్యవసాయం: ఎండలు మండుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలో బుధవారం ఎండ తీవ్రత అప్రమత్తత నుంచి హెచ్చరిక స్థాయిలో ఉంది. 38.6 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా నేలకొండపల్లి మండలంలో 45 డిగ్రీలు, తిరుమలాయపాలెంలో 44.4, ఖమ్మం నగరంలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఆదివారం వాతావరణం కొంత ఉపశమనం కల్పించినా, సోమవారం నుంచి ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. ఇక గురువారం రోహిణి కార్తె ప్రారంభం కానుంది. ఈ కార్తె అంటే రోళ్లు పగిలే ఎండలు ఉంటాయని నానుడి. అయితే జిల్లాలో బుధవారం నుంచే ఆ పరిస్థితి కనిపిస్తోంది. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమవుతోంది. మధ్యాహ్నం తీవ్ర రూపం దాల్చుతోంది.

దీనికి తోడు వడగాలులు వీస్తుండడంతో పగటి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఉదయం, సాయంత్రం మాత్రమే వెళ్లి అవసరాలు తీర్చుకుంటున్నారు. దీంతో మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

'పీఆర్'కు కొత్త కళ

జిల్లాలో నూతనంగా వీక్యూసీ కార్యాలయం

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఇక కొత్త కళను సంతరించుకోనుంది. ఆ శాఖ కార్యకలాపాలు విస్తరించడంతో పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యాన ఖమ్మంలో విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డివిజన్ కార్యాలయంతోపాటు పంచాయతీరాజ్ సబ్ డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. దీంతో కొత్తగా పోస్టులు మంజూరు అయ్యేందుకు మార్గం సుగమమైంది. ఖమ్మం సర్కిల్‌లో ఖమ్మం, సత్తుపల్లి డివిజన్లు ఉన్నాయి. ఖమ్మం డివిజన్ పరిధిలో ఖమ్మం, మధిర, తిరుమలాయపాలెం, ముదిగొండ, వైరా, ఏన్కూరు సబ్ డివిజన్లు ఉన్నాయి. అలాగే సత్తుపల్లి డివిజన్ పరిధిలో సత్తుపల్లి, కల్లూరు సబ్ డివిజన్లు ఉన్నాయి. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పునర్వ్యవస్థీకరణతో విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్(వీక్యూసీ) డివిజన్ కార్యాలయం ఏర్పడటంతో అక్కడ ఇద్దరు ఏఈలు, డీఈ, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరవుతాయి. ఇక పాలేరు నియోజకవర్గంలో కొత్తగా కూసుమంచి పీఆర్ సబ్ డివిజన్ ఏర్పాటు కానుంది.

పదోన్నతులకు అవకాశం..

జిల్లాలోని పీఆర్ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా వివిధ కార్యాలయాలు ఏర్పాటవుతున్న క్రమంలో ఉన్న వారికి పదోన్నతులు రావడంతో పాటు కొత్త పోస్టులు సైతం ఏర్పాటు కానున్నాయి. ఇప్పటి వరకు పని ఒత్తిడితో ఉన్న వారికి కొంత మేర భారం తగ్గనుండగా.. కొత్త కార్యాలయాల ఏర్పాటుతో వివిధ పనుల కోసం వచ్చే వారికి సైతం దూరాభారం సైతం తగ్గనుంది. పనులు వేగవంతంగా జరిగే అవకాశం ఉంటుంది.

1,05,730 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో ఇప్పటివరకు 1,05,730.080 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి గంగుల కమలాకర్ బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులు పండించిన పంటను ప్రణాళికాబద్ధంగా కొనుగోలు చేయాలని, మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకునేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ సమస్య రాకుండా చూస్తున్నామని చెప్పారు. అలాట్ చేసిన రైస్ మిల్లులు తప్పనిసరిగా ధాన్యం అన్‌లోడ్ చేసుకునేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వీసీలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, డీసీఓ విజయకుమారి, డీఏఓ విజయనిర్మల, రవాణాధికారి టి. కిషన్‌రావు, మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీత, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సోములు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి..

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం ఐడీఓసీలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్ర దశాబ్ది అవతరణ దినోత్సవాలను 21 రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా హరితహారం కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టాలని, ప్లాంటేషన్ స్థలాలను గుర్తించాలని, పోడు పట్టాలను సిద్ధం చేయాలని అన్నారు. వచ్చే నెల 24 నుంచి పట్టాల పంపిణీ చేపట్టనున్నామని, ఆర్వోఎఫ్ఆర్ భూములకు రైతుబంధు ఇవ్వాలని, వ్యవసాయ అధికారులు రైతుబంధు మంజూరుకు కావాల్సిన పత్రాలను సిద్ధం చేయాలని చెప్పారు. జీవో 59 కింద ఇప్పటికి 300 మందికి టైటిల్ ఇచ్చామని, వారిలో ఎంత మంది బ్యాంక్ రుణాలు పొందారో వివరాలు సమర్పించాలని సూచించారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. దళితబంధు రెండో విడత యూనిట్ల మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 7 శాఖల్లో 348 మంది ఎన్ఎంఆర్ సిబ్బంది పనిచేస్తున్నారని, వారికి కార్పొరేషన్ పరిధిలో రూ. 499, మునిసిపల్, నాన్ మునిసిపల్ పరిధిలో రూ. 451, ఏజెన్సీ పరిధిలో రూ. 723 దినసరి భత్యం చెల్లిస్తున్నామని, ద్రవ్యోల్బణం దృష్ట్యా 20 శాతం వేతనం పెంపునకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, కెఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కృష్ణా నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, ఎల్‌డీఎం శ్రీనివాస రెడ్డి, సీపీఓ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టన్నెల్‌తో రూ.370 కోట్లు ఆదా

- 'సీతారామ'లో భూములు కోల్పోకుండా సొరంగ మార్గం
- ఇరిగేషన్ సీఈ శంకర్‌నాయక్
- సీఈతో పాటు ఎమ్మెల్యేను సన్మానించిన రైతులు



సీఈ శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందాళ, రైతులు

తిరుమలాయపాలెం: సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోకుండా కాలువకు బదులు సొరంగ మార్గం(టన్నెల్) ద్వారా ప్రభుత్వానికి రూ.370 కోట్లు ఆదా అవుతుందని ఇరిగేషన్ సీఈ శంకర్ నాయక్ తెలిపారు. మండలంలోని బీరోలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని పాతర్లపాడు, బీరోలు, పోచారం గ్రామాల పరిధిలో 546 ఎకరాల విలువైన సారవంతమైన భూమిని కాపాడడంతో పాటు ప్రభుత్వానికి రూ.110 కోట్ల మేర భూసేకరణ నిధులు మిగిలాయని, కాలువ నిర్మాణ వ్యయం రూ.200 కోట్లు, ఆర్.ఆర్ పనులకు రూ.60 కోట్లు ఆదా అయ్యాయని వివరించారు. కాలువ పొడవు కూడా 1.5 కిలో మీటర్లు తగ్గుతుందని తెలిపారు. రెండు, మూడు నెలల పాటు తమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు టన్నెల్ నిర్మాణానికి సంబంధించి సుదీర్ఘ అధ్యయనం చేసి నివేదిక సమర్పించడంతో పాటు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కృషితో సొరంగ మార్గానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోద ముద్ర వేశారని చెప్పారు.

ప్రజల వెన్నంటి ఉంటా..

పాలేరు నియోజకవర్గ ప్రజలంతా తన మనుషులేనని, ఎప్పుడూ వారి వెన్నంటి ఉంటానని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అభివృద్ధే లక్ష్యమని చెప్పారు. నా ఆశ, నా శ్వాస పాలేరు ప్రజల కోసమేనని తెలిపారు. సీతారామ ప్రాజెక్టుకు టన్నెల్ ప్రతిపాదనతో 546 ఎకరాలు సాగులోకి వస్తుందని, భావితరాలకు ఈ భూములు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సీతారామతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, రైతులు, ప్రజల కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు తమ విలువైన భూములు కాపాడిన ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు సీఈ శంకర్‌నాయక్, ఎస్ఈ నర్సింగరావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ బాణాల రమేష్‌రెడ్డిని రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోడా మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, ఖమ్మం రూరల్, కూసుమంచి ఎంపీపీలు బెల్లం ఉమ, శ్రీనివాస్ సర్పంచ్‌లు దేవేందర్‌రెడ్డి, వంచర్ల అలివేలమ్మ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మాలతి, రైతులు కొప్పుల శ్రీనివాసరెడ్డి, విక్రమ్‌రెడ్డి, రాంరెడ్డి, అరుణారెడ్డి, తుళ్లూరి నాగేశ్వరరావు, బాలకృష్ణారెడ్డి, పోలంపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

క్లుప్తంగా

గంజి భాగ్యలక్ష్మికి డాక్టరేట్



సాక్షి, సిటీబ్యూరో: నల్గొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గంజి భాగ్యలక్ష్మికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. వరి, జొన్న గోధుమ, శనగ, బాదం తదితర ఆహార ధాన్యాల పంటలను పీడించే తెల్లపురుగు నివారణకు 'ద ఎఫెక్ట్ ఆఫ్ ఆర్.హెచ్-5849 ఆన్ ద మార్ఫోజెనిటిక్ అండ్ గొనడోట్రోఫిక్ చేంజెస్ ఇన్ కర్సైరా సెఫలోనికా (రైస్ మాత్)' అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు ఆమెకు ఓయూ డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ డాక్టర్ సబితారాజు పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించారు. భాగ్యలక్ష్మి అధ్యాపక వృత్తితో పాటు రచయిత, సైకాలజీ కౌన్సిలర్, మోటివేషనల్ స్పీకర్, సామాజిక కార్యకర్తగా గతంలో గౌరవ డాక్టరేట్‌తోపాటు అనేక పురస్కారాలు అందుకున్నారు. జువాలజీ సబ్జెక్ట్‌లో డాక్టరేట్ అందుకోవడం సంతోషంగా ఉందని, ఈ డాక్టరేట్‌ను తన తండ్రి గంజి అంతయ్యకు అంకితం చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

మూడు రోజులు వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాగల మూడు రోజులపాటు ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. కోతలైన మిరప, వరి, మొక్కజొన్న, జొన్నలు తడవకుండా టార్పాలిన్‌లు, యూరియా బస్తాల పట్టాలతో కప్పి భద్రపర్చుకోవాలని రైతులకు సూచించింది.

ఆలయంలో చోరీ

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం – మంగాపురం గ్రామాల మధ్య ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. ఆలయంలో పూజలు చేసేందుకు రోజుమాదిరిగానే పూజారి జొన్నభట్ల ప్రసాద్‌శాస్త్రి వచ్చాడు. తలుపులు ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించి గ్రామ పెద్దలకు సమాచారం అందించాడు. వారి సమక్షంలో ఆలయంలోకి వెళ్లి పరిశీలించగా హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. ఇటీవల హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు భారీగా హాజరై పూజలు చేశారు. కానుకలు సమర్పించారు. కాగా, హుండీని మరో రెండు రోజుల్లో లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ, దుండగులు గ్రహించి ముందస్తుగానే చోరీకి పాల్పడ్డారు. గతంలో కూడా హనుమాన్ జయంతి అనంతరం చోరీ జరిగింది. పూజారి ప్రసాద్‌శాస్త్రి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి వివరాలు నమోదు చేశారు.

కరెంట్‌షాక్‌తో ఎద్దు మృతి

జూలూరుపాడు: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన బుధవారం నల్లబండబోడు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కల్తీ కృష్ణారావుకు చెందిన దుక్కిటెద్దు మేత కోసం పొలాల వైపు వెళ్లింది. పొలాల్లో ప్రమాదవశాత్తు తెగిపడ్డ త్రీఫేజ్ విద్యుత్ లైన్ తీగను తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో దుక్కిటెద్దు మృతి చెందడంతో రైతు కృష్ణారావు కన్నీటి పర్యంతమయ్యాడు.

తల్లి, కుమార్తెకు గాయాలు

పాల్వంచరూరల్: ఇంట్లోని దండెంపై బట్టలు ఆరేస్తున్న తల్లి, కుమార్తె విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన ఈసం నవ్య ఇంట్లో తీగపై బట్టలు ఆరేస్తోంది. తడిబట్టలు విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన తల్లి ఆదిలక్ష్మి బిడ్డను రక్షించే క్రమంలో పట్టుకోవడంతో ఆమెకు కూడా విద్యుత్‌షాక్ తగిలింది. గమనించిన స్థానికులు 108 ద్వారా వారిద్దరినీ పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి కొత్తగూడెం ఆస్పత్రికి పంపించారు.

మహిళపై రాళ్లతో దాడి

ఖమ్మంరూరల్: ఓ మహిళపై కొందరు రాళ్లతో దాడి చేసిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని గుదిమళ్ల గోపీకాలనీలోని సిమెంట్ బల్లపై ముగ్గురు గోపి, బాబు, హనుమంతు రేణుక కూర్చుని పక్కవారికి ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తున్నారు. దీంతో అదే కాలనీకి చెందిన ప్రమీల, పిచ్చయ్య అక్కడికి వచ్చి రాత్రి సమయంలో ఇక్కడ కూర్చుని న్యూసెన్స్ చేయొద్దని సూచించారు. దీంతో కోపోద్రిక్తులైన వారు రాళ్లతో ప్రమీలపై దాడి చేయగా ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

కేసు నమోదు

అశ్వాపురం: మండలంలో గొల్లగూడెం గ్రామంలో ఈ నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి బుధవారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆనందాపురం గ్రామానికి చెందిన అనిల్ బైక్‌పై వస్తుండగా పాల్వంచకు చెందిన టాటా ఏస్ (పాల వ్యాన్) ఢీకొట్టడంతో అనిల్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అనిల్‌ను భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య దివ్య ఫిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవర్ భూక్యా నవీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

నాటి ప్రాభవం కానరాదేమీ ?

- ఒకప్పుడు వరుస సమావేశాలతో టీటీడీసీ కళకళ
- ఇప్పుడు సభల నిర్వహణ లేక ఖాళీగా భవనం
- మరోపక్క శిథిలమవుతున్న విభాగాలు
- ఆదాయం లేక సిబ్బంది వేతనాలకూ కటకట



శిథిలావస్థకు చేరిన టీటీడీసీ భవనం వెనుక గేటు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాక తెలంగాణ ఏర్పడ్డాక కూడా ఖమ్మంలోని టీటీడీసీ భవనానికి ఓ ప్రత్యేకమైన స్థానం ఉండేది. నగరంలో అన్ని వసతులతో ప్రభుత్వ అధికారిక సమావేశాలు, మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణలు నిర్వహించుకునేందుకు 2002 మే 26న అప్పటి ప్రభుత్వం టీటీడీసీ(ట్రైనింగ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్) పేరుతో భవనాన్ని నిర్మించింది. నాటి నుండి జిల్లా స్థాయి అధికారిక సమావేశాలు ఏవైనా ఈ భవనంలోనే ఏర్పాటు చేసేవారు. ముఖ్యమంత్రులు జిల్లా కేంద్రానికి వచ్చిన సమయంలో కూడా ఇక్కడ సమీక్షలు నిర్వహించేవారు. కానీ గత మూడేళ్లుగా ఈ భవనం నిరాదరణకు గురవుతోంది. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో టీటీడీసీ శిథిలావస్థకు చేరుతోంది.

నాడు కళకళ.. నేడు వెలవెల

టీటీడీసీ భవనాన్ని ప్రారంభించక ముందు ఖమ్మంలో అధికారిక సమావేశాల నిర్వహణకు ఇక్కట్లు ఎదురయ్యేవి. ఆతర్వాత మంత్రులు, కలెక్టర్లు, ఐటీడీఏ పీఓలు, రాష్ట్ర ముఖ్య కార్యదర్శులు ఏ సమావేశమైనా టీటీడీసీలోనే నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఇక మహిళా సంఘాలకు శిక్షణలు, బ్యాంకర్ల సమావేశాలు, సాంకేతిక పరమైన సమావేశాలు అన్నీ ఇక్కడే నిర్వహించేవారు. డీఆర్‌డీఏ నిర్వహణలో ఉన్న ఈ భవనంలో ఇతర శాఖల అధికారులు తమ సమావేశాలను నిర్వహిస్తుండడంతో నిత్యం అధికారులు, ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులతో భవనం కళకళలాడేది. కానీ మూడేళ్ల నుండి టీటీడీసీలో సమావేశాల నిర్వహణ తగ్గిపోయింది. ఇటీవల చిన్నపాటి సమావేశాలు కూడా నిర్వహించడం లేదు. డీఆర్‌డీఏ సమావేశాలను సైతం డీపీఆర్‌సీ భవనం, భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తుండడం.. మరోపక్క కొత్త కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్ హాళ్లు అందుబాటులోకి రావడంతో టీటీడీసీ ముఖం చూసేవారు కరువయ్యారు.



టీటీడీసీ భవనంలోని టెక్నికల్ హాల్‌లో మరమ్మతులకు గురైన సీలింగ్

ఆదాయం రాక భారంగా నిర్వహణ

సమావేశాల నిర్వహణ ద్వారా టీటీడీసీకి ఆదాయం సమకూరేది. ఈ ఆదాయంతోనే సిబ్బందికి వేతనాలు చెల్లించడమే కాక నిర్వహణ ఖర్చులకు వెచ్చించేవారు. ఆ తర్వాత సభలు, సమావేశాలు లేక కనీస ఆదాయం రావడం లేదు. ఇటీవల భవనం మరమ్మతులకు గురైనా చేయించేందుకు నిధులు లేక అధికారులు వదిలేసినట్లు తెలుస్తోంది. ఇక సిబ్బందికి చాలీచాలని వేతనాలను అందిస్తున్నట్లు సమాచారం. భవనం చుట్టూ రక్షణగా ఉన్న కాంపౌండ్ వాల్ వెనుక వైపు కూలిపోయి నెలలు గడుస్తున్నా, వెనుక వైపు ఉన్న గేటు శిథిలావస్థకు చేరినా అలాగే వదిలేశారు. అంతేకాక భవనంలో సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించిన పలు ప్రభుత్వ శాఖలు అద్దె బకాయిలు ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఈ భవనంపై దృష్టి సారించి మరమ్మతు చేయిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ సమావేశాలకు అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూరుతుంది.

సమావేశాలు తగ్గాయి..

ప్రభుత్వ శాఖలన్నీ నూతన కలెక్టరేట్ సముదాయంలోకి మారాక టీటీడీసీలో సమావేశాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం ఇక్కడ సమావేశాలు నిర్వహించేందుకు ఎవరూ ఆసక్తి చూపించడం లేదు. గతంలో తరచుగా సమావేశాలు జరిగే సమయాన నిర్వహణకు ఇబ్బందులు ఉండేవి కావు.

– చాయమ్మ, కేర్ టేకర్, టీటీడీసీ

ముగిసిన జిల్లాస్థాయి సీఎం కప్

రాష్ట్ర పోటీలకు 191 మంది ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఆయా క్రీడాంశాల్లో విజేతలైన వారికి డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన 18 క్రీడాంశాల్లో 1,494 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో పురుషులు 969 మంది, మహిళలు 540 మంది పాల్గొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన పురుషుల్లో 101 మంది, మహిళల్లో 90 మంది ఉన్నారని తెలిపారు. మొత్తం 191 మంది జిల్లా జట్టుకు ఎంపిక కాగా అదనంగా కోచ్ కం మేనేజర్లు 25 మంది ఉన్నారని వివరించారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 27న ఉదయం రావాల్సి ఉంటుందన్నారు. చివరి రోజు నిర్వహించిన హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో విజేతలైన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లాలోని పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ డాక్టర్ వినీత్ హెచ్చరించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని పేర్కొన్నారు. వారి కదలికలను గమనిస్తూ ఉండాలని పోలీసులకు సూచించారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరగబోయే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో జిల్లా పోలీసు శాఖ సాధించిన విజయాలను వివరించాలని చెప్పారు. అత్యాధునిక సాంకేతికత, నేరాల అదుపునకు అవలంబిస్తున్న విధివిధానాలు చాటిచెప్పాలని సూచించారు. షీటీమ్స్ ఆవశ్యకత, మానవ అక్రమరవాణా, సైబర్ క్రైమ్స్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కేసుల సత్వర పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఠాణాల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్టికల్స్ వారీగా విధుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రెహమాన్, వెంకటేష్, రాఘవేంద్రరావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్, హాజరైన పోలీస్ అధికారులు

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న ఆర్డీఓ స్వర్ణలత

జేకేఓసీ ఆర్‌ఓఎఫ్‌ఆర్ గ్రామసభలో ఆర్డీఓ స్వర్ణలత

ఇల్లెందురూరల్: జేకేఓసీ విస్తరణలో భూమి కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని ఆర్డీఓ స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని జేకేఓసీ ఆర్‌ఓఎఫ్‌ఆర్ గ్రామసభను వైసీఓఏ క్లబ్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్వాసిత ప్రాంతంగా గుర్తించిన సర్వే నంబర్ 549 పరిధిలో మొత్తం 261.33 హెక్టార్ల విస్తీర్ణం ఉందని చెప్పారు. అందులో అటవీశాఖ పరిధిలో 86.32 హెక్టార్లు ఉండగా మిగతా 154 హెక్టార్ల భూభాగం ఆక్రమణలో ఉన్నట్లు నిర్ధారించామన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం వాస్తవ నిర్వాసితుల జాబితా సిద్ధం చేస్తామని చెప్పారు. అనంతరం 114 మంది రైతులు, వారి ఆధీనంలో ఉన్న విస్తీర్ణం వివరాలను వెల్లడించారు. వాస్తవంగా సాగులో ఉండి, జాబితాలో చోటు లేనివారు, విస్తీర్ణం తప్పుగా నమోదై ఉంటే వెంటనే తహసీల్దార్ వద్ద తమ పేర్లు, భూమి విస్తీర్ణం వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. గురువారం నుంచి రెవెన్యూ, అటవీశాఖ, సింగరేణి అధికారులు జాయింట్ సర్వే నిర్వహిస్తారని, ఆ సమయంలో ప్రతి రైతు తమకు చెందిన భూమి వద్ద ఉండి వివరాలను పక్కాగా నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

అవి పట్టా భూములే..

గ్రామసభలో పలువురు గిరిజనేతర రైతులు తమ ఆవేదనను ఆర్డీఓకు వివరించారు. 50 ఏళ్లకు పైగా ఈ భూమి సాగు చేసుకుంటున్నామని, గతంలో రెవెన్యూ అధికారులు పట్టాలు కూడా ఇచ్చారని చూపించారు. అయితే, అవి గత ఆర్డీఓ జారీ చేసిన ఫేక్ పట్టాలని, వాటితో సంబంధం లేకుండానే వాస్తవంగా సాగులో ఉన్న ప్రతి రైతుకు పరిహారం మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గ్రామసభలో తహసీల్దార్ కృష్ణవేణి, ఎఫ్ఆర్ఓ నాగేశ్వరరావు, ఎస్టేట్ ఆఫీసర్ మహేశ్, డీఆర్ఓలు సాల్మన్‌రాజు, రాంసింగ్, పంచాయతీ కార్యదర్శి మేడి లక్ష్మణ్, సీఎస్పీబస్తీ సర్పంచ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మధిర: కుటుంబ కలహాలతో పాటు అనారోగ్య సమస్యతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని వైరా రోడ్డులో ఉన్న కనకదుర్గ వైన్స్ పైభవనంలో బుధవారం స్థానిక ఎంప్లాయీస్ కాలనీకి చెందిన వంకదారి వెంకటనారాయణ (60) కిటికీకి కేబుల్ వైరుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంట పనికి పిలిచి నగలు చోరీ

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరికి చెందిన దండుగల దేవిని గుర్తు తెలియని వ్యక్తి వంటపని ఉందని చెప్పి తీసుకెళ్లి ఆమె వద్ద ఉన్న బంగారు నగలు ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దేవి పని కోసం ఖమ్మం గాంధీచౌక్‌లోని అడ్డా వద్ద వేచి చూస్తుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఫంక్షన్‌లో వంటపని ఉందని, గిన్నెలు శుభ్రం చేయడానికి ఇద్దరు మనుషులు కావాలని చెప్పి దేవితో పాటు మరో మహిళను ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. మార్గమధ్యలోని కాల్వ ఒడ్డుకు రాగానే పనికి ఒక్కరే కావాలని చెప్పి దేవి వెంట వచ్చిన మహిళను అక్కడ దించేసి దేవిని కరుణగిరి సెంటర్‌కు తీసుకెళ్లాడు. కట్టెలు తేవాలని సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి కత్తితో దేవిని బెదిరించి బంగారు చెవి దిద్దులు లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

విద్యుత్ వైర్ల చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

- నిందితుల్లో ఒకరు బాలుడు
- రూ. 3.18 లక్షల విలువగల విద్యుత్ వైర్లు, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర



విద్యుత్ వైర్లను పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

భువనగిరి: విద్యుత్ వైర్ల చోరీ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దాసరుతండాకు చెందిన బానోత్ చంద్రశేఖర్, బానోతు మధుకుమార్, మొద్దు కిషన్, మరో బాల నిందితుడితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రోళ్లగడ్డతండాకు చెందిన గుగులోతు పవన్‌కల్యాణ్ వీరంతా కూలి పనులు చేసుకుంటూనే విద్యుత్ వైర్లను చోరీ చేస్తున్నారు. వారికి హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నివాసం ఉండే పాత సామగ్రి విక్రయించే పిడిగు నవీన్ చోరీ చేయడానికి ఉపయోగపడే కట్టర్లు, ఇతర సామగ్రి, రవాణా వాహనం సమకూర్చుతున్నాడు. నిందితులు అక్కడక్కడా చోరీ చేసిన వైర్లను నవీన్‌కు విక్రయించేవారు. ఈ ముఠా సభ్యులు ఇటీవల బీబీనగర్‌లోని ఎంఆర్‌ఆర్ వెంచర్‌లో విద్యుత్ వైర్లను చోరీ చేశారు. ఈ నెల 20వ తేదీన వెంచర్ సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. వాహనాల తనిఖీల్లో భాగంగా నిందితులను కొండమడుగు వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.3.18 లక్షల విలువగల విద్యుత్ వైర్ల బండిళ్లు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఓ మైనర్ ఉండగా జెజె యాక్టు మేరకు నోటీసులు అందజేసినట్లు చెప్పారు. దొంగతనానికి పాల్పడేందుకు సహకారం అందించడంతో పాటు వైర్లను కొనుగోలు చేస్తున్న నవీన్‌ను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. పట్టుబడిన వారు ఇప్పటికే బీబీనగర్, భువనగిరితో పాటు ఆత్మకూర్ (ఎం) మండలాల పరిధిలో చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. సమావేశంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ యుగేందర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి



వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

కల్లూరు: కల్లూరు పట్టణం ఖాన్‌ఖాన్‌పేట వద్ద ఈ నెల 7వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి బుధవారం ఖమ్మంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్వరరెడ్డి (55) రాత్రి 10.30 గంటల సమయంలో తిరువూరు వెళ్తుండగా ఖాన్‌ఖాన్‌పేట సమీపంలో స్కూటీపై వస్తున్న దేశబోయిన సాయిలోకేశ్ అజాగ్రత్తగా వచ్చి వెంకటేశ్వరరెడ్డి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో వెంకటేశ్వరరెడ్డి తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వరరెడ్డి అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ రఘు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

ముదిగొండ మండలంలో..

ముదిగొండ: కుటుంబ కలహాలతో పురుగులమందు సేవించిన వివాహిత ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మండలంలోని పమ్మికి చెందిన రాయభారపు పవిత్ర (30) కుటుంబ కలహాల నేపథ్యంలో క్షణావేశంలో మంగళవారం పురుగులమందు సేవించింది. చికిత్స నిమిత్తం ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరుడు నరేశ్ ఫిర్యాదు మేరకు ముదిగొండ ఎస్‌ఐ నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి విద్యార్థి మృతి

ఖమ్మంక్రైం: పందిళ్లపల్లి – ఖమ్మం రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి విద్యార్థి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామానికి చెందిన గుణకంటి ఉపేందర్ (21) నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతూ ఓ రెస్టారెంట్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. అతను బుధవారం విజయవాడ వెళ్లి కనకదుర్గమ్మ దర్శనం చేసుకుని రైలులో ఖమ్మం వస్తున్నాడు. పందిళ్లపల్లి – ఖమ్మం రైల్వేస్టేషన్ల మధ్య 491వ కిలోమీటరు వద్ద రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అన్నం ఫౌండేషన్ అధినేత అన్నం శ్రీనివాసరావు తన బృందంతో వచ్చి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రైల్వే ఎస్‌ఐ పి.భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు మందుపాతరలు నిర్వీర్యం

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ప్రధాన రహదారిపై మావోయిస్టులు అమర్చిన రెండు శక్తివంతమైన మందుపాతరలను గుర్తించిన పోలీసులు బుధవారం వాటిని నిర్వీర్యం చేశారు. వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లాలోని ఆవుపల్లి – బాసగూడ ప్రధాన రహదారికి కింది భాగంలో కందకాన్ని తవ్విన మావోయిస్టులు అందులో సుమారు 25 కిలోల సామర్థ్యం కలిగిన రెండు మందు పాతరలను ప్లాస్టిక్ డ్రమ్ముల్లో ఏర్పాటు చేశారు. గత నెల 26న దంతెవాడ జిల్లాలోని అరన్‌పూర్ రహదారిలో మావోయిస్టులు ప్రధాన రహదారిపై మందుపాతర పేల్చి 10 మంది డీఆర్‌జీ జవాన్లతో పాటు ఒక డ్రైవర్‌ను హతమార్చిన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టు ప్రాబల్యం ఉన్న అన్ని జిల్లాల్లోని ప్రధాన రహదారులను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆవుపల్లి – బాసగూడ రహదారిని రెండు రోజులుగా తనిఖీ చేస్తుండగా బుధవారం ఉదయం ఒకే చోట అమర్చిన రెండు శక్తివంతమైన మందుపాతరలు లభ్యం కావడంతో వాటిని బాంబు డిస్పోజబుల్ టీం నిర్వీర్యం చేసింది. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ 168 బెటాలియన్, కోబ్రా 222 బెటాలియన్‌లకు చెందిన జవాన్లు పాల్గొన్నారు.



పోలీసులు గుర్తించిన మందుపాతర

వరి గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కల్లూరురూరల్: మండలంలోని వ్యాచ్యానాయక్ తండా గ్రామంలో వరి గడ్డివాము ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న కల్లూరు పోలీసులు సత్తుపల్లి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు వెంటనే గ్రామానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రఘు, అగ్నిమాపక శాఖ హెడ్ కానిస్టేబుల్ రామారావు, కానిస్టేబుళ్లు తడికమల్ల నర్సింహారావు, రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

48 రోజులు.. రూ.1.62 కోట్లు

భద్రాద్రి రామయ్యకు భారీగా ఆదాయం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం హుండీ ఆదాయం 48 రోజులకు రూ.1,62,13,534 సమకూరింది. ఆలయ హుండీలను ఈవో రమాదేవి, దేవాదాయ శాఖాధికారుల సమక్షంలో చిత్రకూట మండపంలో బుధవారం లెక్కించారు. పై నగదుతో పాటు 182 గ్రాముల బంగారం, కేజీ 800 గ్రాముల వెండివచ్చాయని ఈవో తెలిపారు. ఇంకా 200 యూఎస్ డాలర్లు, 100 ఒమన్ బైసాలు, 60 యూకే యూరోలు, శ్రీలంకకు చెందిన వెయ్యి రూపీస్‌తో పాటు ఇతర విదేశీ నగదు కూడా లభించిందని వెల్లడించారు.

అరుణ మరణం అవాస్తవం

చర్ల: మావోయిస్టు పార్టీ చర్ల – శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు, ప్రభుత్వం చేస్తున్న వార్తల్లో నిజం లేదని...ఆ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ చర్ల – శబరి ఏరియా కమిటీ బుధవారం లేఖ విడుదల చేసింది. అరుణకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, ప్రభుత్వ, పోలీసుల ప్రకటన అవాస్తవమని పేర్కొంది. పార్టీపై కుట్రలో భాగంగానే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. 2024 నాటికి మావోయిస్టు పార్టీని నిర్మూలించాలనే లక్ష్యంతోనే పాలకులు బహుముఖ దాడులకు పాల్పడుతున్నారని పేర్కొంది. అరుణ క్షేమంగా ఉందని, పార్టీ కార్యకలాపాల్లో, విప్లవోద్యమంలో చురుగ్గా పాల్గొంటోందని, దీన్ని ప్రజలు గమనించాలని కోరింది. కాగా, మావోయిస్టులు విడుదల చేసిన లేఖపై అరుణ సంతకమే ఉండటం గమనార్హం.

కేతు విశ్వనాథరెడ్డికి కన్నీటి వీడ్కోలు

ఎర్రగుంట్ల/ కడప వైఎస్సార్ సర్కిల్: సాహితీ శిఖరం ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి (84)కి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని రంగసాయిపురంలో బుధవారం కుటుంబసభ్యులు, ఆప్తుల నడుమ అంత్యక్రియలు జరిగాయి. అంతకుముందు కడప నుంచి ఆయన భౌతికకాయాన్ని ఇక్కడి స్వగృహానికి తీసుకొచ్చారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రనాథ్‌రెడ్డి, కార్మిక నాయకుడు ఎం.రమణారెడ్డి, టీడీపీ నాయకుడు లింగారెడ్డితో పాటు పలువురు రచయితలు, సాహితీ వేత్తలు, నాయకులు పాల్గొన్నారు. కాగా, కేతు విశ్వనాథరెడ్డి మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవేదన వెలిబుచ్చారు. కడప సింగపూర్ టౌన్ షిప్‌లో బుధవారం ఉదయం కేతు విశ్వనాథరెడ్డి భౌతికకాయం వద్ద ఆయన నివాళులర్పించారు.

వివేకాను హత్య చేసిన వాళ్లు విచ్చలవిడిగా బయట తిరుగుతున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

చికిత్స పొందుతున్న వైఎస్ అవినాశ్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మిని ఆమె పరామర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ''శ్రీ లక్ష్మిని పరామర్శించా. ఆమె ఆరోగ్యం ఆందోళనకరంగానే ఉంది. ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థించా. వైఎస్ భాస్కర్‌రెడ్డి జైల్లో ఉన్నారు. అవినాశ్‌ను కూడా అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. సీబీఐ వ్యవహారంతో ఒక తల్లిగా శ్రీలక్ష్మి తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. తల్లడిల్లిపోతున్న ఆమెను చూసి దేవుడిని ప్రార్థించేందుకు ఆసుపత్రికి వచ్చా'' అని వ్యాఖ్యానించారు. శ్రీలక్ష్మి ఒక దశలో డెత్ స్టేజీకి వెళ్లి బయటకు వచ్చారని, తనతో చాలాసార్లు నాతో దైవసేవకు కూడా వచ్చారని వైఎస్ విమలమ్మ తెలియజేశారు.

చానెల్స్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు...

అవినాశ్‌ను టార్గెట్ చేసి సీబీఐ అధికారులు వెళ్తున్నట్లు అనిపిస్తోందని, టీవీ చానల్స్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమలమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. ''వైఎస్ వివేకానందరెడ్డి అన్న మంచి పేరుతో బతికారు. ఆయన హత్య తర్వాత ఆ మంచితనానికే మచ్చ తెస్తున్నారు. ఇది చాలా అన్యాయంగా ఉంది. రాజకీయంగా కూడా ఎంత మంచిగా ఉన్నాడో అందరికీ తెలుసు. అనవసరంగా అవినాష్‌ను లక్ష్యంగా చేసుకుని సీబీఐ ముందుకెళ్తోంది. ఇదెంతమాత్రమూ న్యాయం కాదు. దయజేసి గమనించండి. మీడియా వల్ల ప్రజలకు సరైన విషయాలు తెలియాలి. ఆ ఉద్దేశంతోనే మీడియా పనిచేయాలి. అదే బాగుంటుంది. న్యాయం ఆలస్యమైనా గెలుస్తుంది. దేవుడు ఎప్పుడూ అన్యాయం చేయడు. తల్లి ప్రార్థనలు దేవుడు ఆలకిస్తూనే ఉన్నాడు'' అని విమలమ్మ వ్యాఖ్యానించారు. 'అత్తా! నేను ఏ తప్పు చేయలేదని, నేను దేవున్ని నమ్ముతున్నానని, నాకు న్యాయం జరుగుతుందని చాలా ధైర్యంగా అవినాశ్ నాతో ఆస్పత్రిలో చెప్పారు!' అని అన్నారు. తప్పు చేస్తే అది మొహంలో తెలిసిపోతుందని చెప్పారామె.

సునీత వెనక దుష్టశక్తులున్నాయి...

ఒకవైపు కూతురు లాంటి మేనకోడలు సునీత, మరోవైపు సోదరుడి కుమారుడు అవినాశ్ ఉన్నారని విమలమ్మ వ్యాఖ్యానించారు. ''ఎవరు తప్పు? ఎవరు ఒప్పు? అనేది దేవుడికే తెలియాలి. అయితే అవినాశ్‌రెడ్డి మాత్రం ఏ తప్పూ చేయలేదనే నమ్మకం నాకుంది. తన తండ్రి హత్య వెనుక ఈ కుటుంబ సభ్యులు లేరని సునీతే గతంలో చెప్పింది. మళ్లీ ఇపుడు ఎందుకు మాట మారుస్తోందో తెలియడం లేదు. కానీ సునీత వెనుక దుష్టశక్తులు ప్రభావం చూపుతున్నాయని నాకు అనిపిస్తోంది. ఎందుకంటే నేను గతంలో ఆమెతో మాట్లాడాను. నువ్వు చేస్తున్నది తప్పని చెప్పా. నలుగురు వ్యక్తులు మేమే చంపామని చెబుతుంటే ఎందుకు ఏ తప్పూ చేయని వారిని టార్గెట్ చేశావని అడిగా. ఆధారాలు లేనప్పుడు అవినాశ్‌ను ఎందుకు లక్ష్యం చేశావని అడిగా. కానీ ఆమె మాట్లాడేందుకు ఇష్టపడలేదు. మనం దేవుని బిడ్డలం.. దేవుడే చూసుకుంటాడు. ఇలాంటివి చేయకమ్మా అని చెబితే సునీత వినలేదు'' అని విమలమ్మ వివరించారు. ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ... ''ఎలాంటి రుజువులూ లేనప్పుడు ఒక వ్యక్తిని టార్గెట్ చేయడం సరైంది కాదు. పోనీ ఆధారాలు చూపించమంటే చూపించేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. సున్నిత మనస్తత్వం ఉన్న అవినాశ్‌ను టార్గెట్ చేయడం అన్యాయం అనిపిస్తోంది'' అని వ్యాఖ్యానించారు. ఏ తప్పూ చేయని అన్న (వైఎస్ భాస్కర్‌రెడ్డి) జైలులో ఉన్నాడని, 72 ఏళ్ల ఆయనకు వెన్నెముక నొప్పి ఉన్నా కేసులు పెట్టారని, ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తన సోదరుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు తమ కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉండేవని, ఇప్పుడు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశం అనంతరం మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రి ఎదుట ఎమ్మెల్యేలు, కార్యకర్తల నిరసన

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ వాస్తవాలు తేల్చాలని, బాధితులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు కోరారు. బుధవారం వారు విశ్వభారతి ఆస్పత్రి ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఐదురోజులుగా వందల సంఖ్యలో కార్యకర్తలు ఆస్పత్రి ఎదుటే రాత్రింబవళ్లు ఉంటున్నారు. తల్లి అనారోగ్యంతో ఆమె బాగోగులు చూసుకుంటున్న అవినాశ్‌కు మద్దతుగా వారు అక్కడే ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా ఆస్పత్రికి వచ్చి శ్రీలక్ష్మిని పరామర్శించి వెళుతున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి శ్రీలక్ష్మిని పరామర్శించారు. తర్వాత ఆస్పత్రి ఎదుట వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాచమల్లు, హఫీజ్‌ఖాన్, సుధాకర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మేయర్ బీవై రామయ్య, కడప, కర్నూలు కార్పొరేటర్లు, మండలాధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. అవినాశ్‌కు అండగా కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట ప్రశాంతవాతావరణంలో బైఠాయించడం మినహా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకపోవటంతో బుధవారం పోలీసు బందోబస్తును తగ్గించారు.

లక్షన్నర కుటుంబాలు | 4 లక్షల ఎకరాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 23 వరకు వచ్చిన అర్జీలను పరిగణనలోకి తీసుకొని 1,50,012 మంది రైతులకు పట్టాలు అందజేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50,595 మంది రైతులకు 1,51,195 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 24,972 మంది రైతులకు 70,434 ఎకరాలు.. అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు రైతులకు ఎకరం భూమికి పట్టాలు అందించనున్నారు.

జిల్లాల్లో సభలు పెట్టి..

పోడు పట్టాలు జూన్ 24 నుంచి అందించనున్నారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో సీఎం కేసీఆర్‌తో సభలు పెట్టి ఆయన చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రులు చెబుతున్నారు. మొదటి సభ భద్రాద్రి కొత్తగూడెంలో కానీ, మహబూబాబాద్‌లో కానీ నిర్వహించే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రానికి ఈశాన్యం మూలలో ఉన్న ఈ రెండు జిల్లాల్లో పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గిరిజనులకు స్వర్ణయుగం

దేశ చరిత్రలో అశోక చక్రవర్తి పరిపాలనా కాలాన్ని స్వర్ణయుగంగా చరిత్ర చెబుతుంది. తెలంగాణ గిరిజనులకు మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన స్వర్ణయుగం వంటిది. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మా తండాలు, గిరిజన ఆవాసాలను పంచాయతీలుగా ప్రకటించారు. అడగకుండానే 10 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు అటవీ భూములకు హక్కు పత్రాలు అందజేస్తున్నారు. ఈ జాబితానే కాకుండా ఇంకా అర్హులు మిగిలి ఉంటే అధికారులకు చెప్పండి వారికి కూడా హక్కు పత్రాలు వస్తాయి.

– సత్యవతి రాథోడ్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

పోడు భూమి హక్కుపత్రాల జాబితా

జిల్లా	దరఖాస్తులు	భూమి (ఎకరాలు)
భద్రాద్రి కొత్తగూడెం	50,595	1,51,195
మహబూబాబాద్	24,972	70,434
ఆసిఫాబాద్	15,254	44,750
ఆదిలాబాద్	12,222	31,683
ములుగు	7,413	18,869
నిర్మల్	7,257	20,051
ఖమ్మం	5,857	9,779
కామారెడ్డి	4,480	12,969
నిజామాబాద్	3,788	7,697
వరంగల్	3,654	8,366
భూపాలపల్లి	3,428	8,537
మంచిర్యాల	2,403	5,024
నల్లగొండ	2,256	4,426
నాగర్‌కర్నూల్	1,956	4,968
రాజన్న సిరిసిల్ల	1,614	2,857
సంగారెడ్డి	1,128	1,807
మెదక్	610	524
వికారాబాద్	434	554
వనపర్తి	311	379
యాదాద్రి భువనగిరి	186	427
సూర్యాపేట	84	189
హనుమకొండ	70	65
మహబూబ్‌నగర్	19	22
జగిత్యాల	15	19
నారాయణపేట	03	08
పెద్దపల్లి	03	01
మొత్తం	1,50,012	4,05,601

గుడిసెల తొలగింపులో తోపులాట

- పెట్రోలు పోసుకుని ఒకరి ఆత్మహత్యాయత్నం
- మహబూబాబాద్ శివారులో ఉద్రిక్తత

మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో పేదలు వేసుకున్న గుడిసెల తొలగింపులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, గుడిసెవాసుల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. గుడిసెలను తొలగించేందుకు వచ్చిన జేసీబీని అడ్డగించి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. జిల్లా కేంద్రం శివారు కురవి రోడ్డులోని 255/1 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో 2



జేసీబీ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న గుడిసెవాసులు

వేల మంది పేద ప్రజలు గుడిసెలు వేసుకున్నారు. అయితే పలుమార్లు పోలీసులు వాటిని తొలగించడం, పేదలు మళ్లీ గుడిసెలు వేయడం పరిపాటిగా మారింది. మళ్లీ బుధవారం ఉదయం ఆర్డీఓ కొమురయ్య, తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి పోలీసులతో కలసి గుడిసెల ప్రాంతానికి వెళ్లారు. జేసీబీలతో గుడిసెలను తొలగించే ప్రయత్నం చేయగా గుడిసెవాసులు అడ్డుకున్నారు. మహిళలు అధికారులను అడ్డగించి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఓ యువకుడు తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు పంపించారు. ఆర్డీఓ కొమురయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయడం సరికాదని, అర్హులైన పేదలకు ప్రభుత్వమే స్థలాలు కేటాయిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నాయకులు, కొంత మంది గుడిసెవాసులను పోలీసులు అరెస్ట్ చేశారు. అస్వస్థతకు గురైన ఇద్దరు మహిళలను ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థినిపై బ్లేడ్‌తో దాడి

ప్రేమను నిరాకరించిందని హత్యాయత్నం

కొండాపూర్(సంగారెడ్డి): తన ప్రేమను నిరాకరించిందని ఓ డిగ్రీ విద్యార్థినిపై ప్రేమోన్మాది బ్లేడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటన బుధవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. సంగారెడ్డి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనూరు మండలానికి చెందిన ఓ విద్యార్థినికి తల్లిదండ్రులు లేరు. బంధువుల ఇళ్ల వద్ద ఉండి సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రెండేళ్లకిందట.. నారాయణఖేడ్ మండలం ర్యాకల్ పోతంగల్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌తో మీసేవ సెంటర్‌లో పరిచయం ఏర్పడింది. అతను ఇంటర్ వరకు చదివి పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఉంటూ కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పరిచయాన్ని అడ్డుగా పెట్టుకొని ఆ విద్యార్థినికి ఫోన్ చేయడం, అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టడం మొదలెట్టాడు. దీంతో ఇటీవలే సిమ్ కార్డు మార్చింది. డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాగైనా కాలేజీకి వస్తుందని తెలుసుకొని, ఉదయం 9 గంటలకే కళాశాలకు చేరుకున్నాడు. ఆ విద్యార్థిని కళాశాల ఆవరణకు చేరుకోగానే తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో మెడపై, చేతులపై దాడి చేశాడు. గాయాలపాలైన విద్యార్థిని గట్టిగా కేకలు వేయడంతో అక్కడకు చేరుకున్న తోటి విద్యార్థులు ప్రవీణ్‌కుమార్‌ను పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థిని పరీక్ష కేంద్రంలోకి పంపి, ప్రవీణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరీక్ష ముగిశాక ఆ విద్యార్థినిని బంధువుల ఇంటికి పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

జిల్లా వార్తలు

ఐటీడీఏ డీడీ బదిలీ

ఏపీవో జనరల్‌కు అదనపు బాధ్యతలు



డీడీ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) గా పనిచేస్తున్న రమాదేవికి బదిలీ అయింది. ఈ మేరకు పీఓ గౌతమ్ పొట్రు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే డేవిడ్‌రాజ్ గురుకులం ఇన్‌చార్జ్ ఆర్‌సీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2020 డిసెంబర్‌లో డీడీగా బాధ్యతలు స్వీకరించిన రమాదేవి విధుల్లో మృదుస్వభావిగా పేరు తెచ్చుకున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాలతో పాటు ఇంగ్లిష్ మీడియం సులభ పద్ధతిలో నేర్పించేందుకు సకాలంలో మెటీరియల్ అందేలా చర్యలు తీసుకున్నారు. అయితే ఈ ఏడాది విద్యా సంవత్సరం చివరిలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, వార్డెన్ల డిప్యూటేషన్ల రద్దు ఆమెకు మచ్చగా మిగిలింది. ఐటీడీఏలో ఉన్నతాధికారులకు ప్రతి ఏడాది తెలిసి జరిగే తంతు అయినప్పటికీ ఐటీడీఏలోని అధికారుల నడుమ అంతర్యుద్ధంలో రమాదేవి పావుగా మిగిలారని, తద్వారా విచారణ అనంతరం ఆమెకు బదిలీ అయిందని సమాచారం.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో ఎంపీ నామ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు గురు, శుక్రవారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం ఖమ్మం ఐడీఓసీలో జరిగే దిశ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం నేలకొండపల్లి చెన్నారం, చంద్రుగొండ, ఖమ్మం, ఖమ్మంరూరల్ మండలాల్లో పర్యటిస్తారు. శుక్రవారం ఖమ్మం, ముదిగొండ మండలాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

ఖమ్మంక్రైం: జిల్లాలోని వివిధ కేసుల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు జప్తు చేసిన మూడు ద్విచక్ర వాహనాలకు శుక్రవారం ఉదయం 11 గంటలకు నగరంలోని వీడీవోస్ కాలనీలో గల ఎక్సైజ్ స్టేషన్ -1లో వేలం నిర్వహించనున్నట్లు ఖమ్మం జిల్లా ఎక్సైజ్ అధికారి జి.నాగేంద్రరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు ఎక్సైజ్ స్టేషన్-1లో సంప్రదించాలని సూచించారు.

'మాన్యం' కౌలుపై పట్టింపు కరువు!

- ఆలయ భూముల కౌలు భగవంతుడే వసూలు చేసుకోవాలా?
- ఉమ్మడి జిల్లాలో రూ.2.23 కోట్ల బకాయిలు
- పంటలు పండుతున్నా నామమాత్రపు కౌలు కూడా చెల్లించని వైనం
- అయినా పట్టింపు లేనట్లుగా దేవాదాయ శాఖ



అన్నపురెడ్డిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి జిల్లాలో ప్రతీ గ్రామానికి కనీసం ఓ ఆలయం.. ఆ ఆలయానికి కొంత భూమి ఉన్న మాట వాస్తవం. ఆలయ నిర్వహణకు ఇబ్బందులు ఎదురుకావొద్దని పూర్వీకులు భూములు కేటాయించారు. ఇలా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భగవంతుడి పేరిట వేలాది ఎకరాల మాన్యం భూములు ఉన్నా.. కౌలు ద్వారా ఆదాయం మాత్రం నామమాత్రంగానే వస్తోంది. అతి తక్కువ కౌలుకే భూములకు కేటాయిస్తుండగా, పంటలు పండుతున్నా కౌలు చెల్లించని రైతులు.. పట్టించుకోని అధికారుల తీరుతో బకాయిలు నానాటికీ పేరుకుపోతున్నాయి.

ఖమ్మం జిల్లాలో 4,865.16 ఎకరాలు

ఖమ్మం జిల్లాలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ లెక్కల ప్రకారం 188 ఆలయాలకు 4,865.16 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ మొత్తంలో పట్టాలు కలిగిన భూమి 2,386.01 ఎకరాలు, పహాణీలో 2,479.15 ఎకరాల భూమి ఉంది. ఇందులో అర్చకుల సాగుబడిలో 1400.1 ఎకరాలు, కౌలు పరిధిలో 2,322.34 ఎకరాలు, రహదారులు, గుట్టలు, కొండల కింద 169.12 ఎకరాలు, కబ్జాకు గురైన భూమి 862.14 ఎకరాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఆయా భూముల ద్వారా రూ.3,39,41,825 కౌలుకు గాను రూ.2,79,44,658 వసూలు కాగా రూ.59,97,167 బకాయి ఉంది. నేలకొండపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి మండల పరిధిలో 291.26 ఎకరాల భూమి దాదాపు 200 మంది రైతుల సాగులో ఉండగా ఎకరాకు రూ.500 నుంచి రూ.1000 వరకే చెల్లిస్తున్నారు. కల్లూరులోని సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానం పరిధిలో 235.03 ఎకరాల భూమి గోపాలదేవరబోయినపల్లిలో 200 మంది రైతుల సాగులో ఉండగా వరి పండించే భూమికి ఎకరా కౌలుగా రూ.2,500 వరకు చెల్లిస్తున్నారు. వైరా మండలం ఉలిగొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కింద ఉన్న 148.32 ఎకరాల భూమిని 120 మంది రైతులు సాగు చేస్తూ ఎకరాకు రూ.7,500 చొప్పున బకాయిలు భారీగానే ఉన్నాయి.

భద్రాద్రి జిల్లాలో 9,906.04 ఎకరాలు

దేవాదాయ, ధర్మాదాయ శాఖ లెక్కల ప్రకారం భద్రాద్రి జిల్లాలోని 34 ఆలయాలకు 9,906.04 ఎకరాల భూములు ఉండగా.. ఇందులో అర్చకుల సాగుబడిలో 175.12, కౌలులో 7,200.01 ఎకరాలు, గుట్టలు, రహదారుల కింద రూ.1,230.12 ఎకరాలు ఉంది. మరో 1,039.03 ఎకరాలు కబ్జాదారుల చేతిలో ఉన్నట్లు అంచనా. ఈ మొత్తం భూములకు రూ.3,89,02,834 కౌలుగా నిర్ణయించగా రూ.1,63,06,578 బకాయిలు పేరుకుపోయాయి. ఇల్లెందుకు చెందిన పర్సా అనంత రామయ్య ట్రస్ట్ కింద 694.28 ఎకరాలు సింగరేణి, గేటు కారేపల్లి, మాధారం ప్రాంతాల్లో 500 మంది రైతులు(సిట్టింగ్ టెండెన్సీ) సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.1,500 నుంచి రూ.2,500 వరకు కౌలు నిర్ణయించగా రూ.13.80 లక్షలు వసూలు కావాల్సి ఉంది. అన్నపురెడ్డిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం కింద 1,255 ఎకరాల భూమికి కౌలుగా రూ.35 లక్షలు నిర్ణయించగా కేవలం రూ.10 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం పరిధిలో 1,352 ఎకరాల భూమి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉంది. ఈ భూముల కౌలు కూడా భారీగా పేరుకుపోగా.. పలు ప్రాంతాల్లో కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టడం గమనార్హం.

కౌలు విధానం ఇలా..

ఆలయాల నిర్వహణ కోసం గ్రామస్తులు కేటాయించిన భూములకు కౌలుకు ఇస్తూ వచ్చే ప్రతిఫలాన్ని అర్చకుల జీవనం, ఆలయ నిర్వహణకు వినియోగిస్తుంటారు. ఆయా భూములకు ఉన్న నీటి వనరుల ఆధారంగా కౌలు నిర్ణయించి వసూలు చేస్తుంటారు. అయితే, ఆయా భూములు ఏళ్లుగా గ్రామస్తుల చేతుల్లో బాడుగ (సిట్టింగ్ టెండన్సీ)గా ఉన్నా కనీస కౌలు వసూలు కావడం లేదు. సరైన రీతిలోనే పంటలు పండుతున్నా సాగుదారులు ఎకరాకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు కూడా చెల్లించడం లేదు. పలు సందర్భాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆ మొత్తం కూడా చెల్లించక బకాయిలు పెరుగుతున్నాయి. ఇక కబ్జాకు గురైన భూముల నుంచి కౌలు వసూలు కాకపోగా, కేసుల నిమిత్తం దేవాదాయ శాఖ అధికారులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఆలయాల భూములు రహదారుల విస్తరణలో పోవటం, గుట్టలు, కొండలుగా ఉండటంతో ఎలాంటి కౌలూ ఉండడం లేదు.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో దేవాదాయ భూముల కౌలు బకాయిలు (రూ.ల్లో)

జిల్లా	ఆలయాలు	మొత్తం కౌలు	వసూలైనది	బకాయి
ఖమ్మం	52	3,39,41,825	2,79,44,658	59,97,167
భద్రాద్రి	18	3,89,02,834	2,25,96,256	1,63,06,578
మొత్తం	70	7,28,44,659	5,05,40,914	2,23,03,745

వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆలయాల భూముల నుంచి భారీగా కౌలు వసూలు కావాల్సి ఉంది. కౌలు చెల్లించని వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. పెద్ద ఎత్తున బకాయిలు పేరుకుపోయిన ప్రాంతాల్లో దేవాదాయ శాఖ ఉద్యోగులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి వసూళ్లు చేపడతాం.

– ఏ.సులోచన, అసిస్టెంట్ కమిషనర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

అధికారుల పాత్రపై అనుమానాలు!

- ఉత్తుత్తి టెస్టులతో సహకారం
- సబ్ కాంట్రాక్టర్‌తో ములాఖత్
- సూర్య కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు


సత్తుపల్లి: సింగరేణి ఉద్యోగాల పేరిట జరిగిన మోసంలో విస్తుపోయే నిజాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. కొందరు సింగరేణి అధికారుల పాత్రపై సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సబ్ కాంట్రాక్టర్ శరత్‌చంద్ర డైలీ వర్క్ ఆర్డర్‌ను అడ్డం పెట్టుకుని అధికారులను ప్రసన్నం చేసుకొని నిరుద్యోగులకు టోకరా కొట్టినట్టు తెలిసింది. బీటెక్, డిగ్రీ, డిప్లొమా చేసిన నిరుద్యోగులను అధికారుల చాంబర్‌లకు తీసుకెళ్లి వీరికి ఉద్యోగాలివ్వాలని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. సదరు అధికారి శరత్‌చంద్ర తీసుకొచ్చిన నిరుద్యోగులను సింగరేణి ఉద్యోగి పక్కన కూర్చోబెట్టి టైపింగ్ టెస్ట్ నిర్వహించారని బాధితులు అంటున్నారు. దీంతో కొందరు ఆకర్షితులై లక్షల్లో డబ్బు ముట్టజెప్పినట్టు తెలుస్తోంది. ఇదే అదనుగా యూనిఫాంకు రూ.14వేలు అదనం అంటూ వసూలు చేశారని తెలుస్తోంది. మీకు త్వరలో క్వార్టర్ కూడా అలాట్ అవుతుందని చెప్పగా.. నెలలు గడిచినా ఉద్యోగం, క్వార్టర్ అలాట్ కాకపోవటంతో టెస్టులు నిర్వహించిన అధికారి వద్దకు వెళ్లి అడగగా ఆయన సబ్ కాంట్రాక్టర్‌ను అడగండంటూ సమాధానం చెప్పడం, బాధితులు నిలదీయడంతో ఈ వ్యవహారమంతా బయటపడింది.

నాలుగు రోజులు టైం ఇవ్వండి..

సబ్‌కాంట్రాక్టర్ శరత్‌చంద్ర పరారు కావడంతో పట్టుబడిన హరీష్‌ను పోలీసులకు అప్పగించిన విషయం విదితమే. హరీష్ తరఫున మధ్యవర్తిగా వచ్చిన ఓ స్థానిక ప్రజాప్రతినిధి తాళ్లమడకు చెందిన ఆరుగురి డబ్బు రూ.1.81లక్షలు బుధవారం నాటికి అందిస్తానని లెటర్ రాయించి హరీష్‌ను సొంత పూచీకత్తుపై తీసుకెళ్లాడు. ఇప్పుడు ఆ మధ్యవర్తి హరీష్‌పై కేసు నమోదైనందున డబ్బులు ఎలా ఇస్తామంటూ బాధితులను నిలదీయటంతో వారంతా కలిసి సత్తుపల్లి సీఐ టి.కరుణాకర్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం జరగకుంటే కుటుంబాలతో సహా వెళ్లి సీపీని కలుస్తామని చెబుతున్నారు. దీనిపై సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ మాట్లాడుతూ.. కార్యాలయానికి హాజరు కావాలని కొత్తగూడేనికి చెందిన శ్రీసూర్య కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చామని, ఒకటి, రెండు రోజుల్లో సమాధానం వస్తుందని తెలిపారు. బాధితులకు డబ్బులు చెల్లించే వరకు అవసరమైతే బిల్లులను నిలిపేసి కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామన్నారు. సత్తుపల్లి పట్టణ సీఐ కరుణాకర్‌ను వివరణ కోరగా శరత్‌చంద్ర కోసం గాలిస్తున్నామని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

తిరిగి విధుల్లోకి ఆర్టిజన్లు

ఉమ్మడి జిల్లాలో పది మందికి అవకాశం



పాల్వంచలో ఆందోళన చేస్తున్న ఆర్టిజన్లు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: తొలగించబడిన ఆర్టిజన్లను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. దీంతో ఖమ్మం జిల్లాలో ఏడుగురు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముగ్గురు ఉద్యోగులకు తిరిగి విధుల్లోకి చేరే అవకాశం కలగనుంది. ఆర్టిజన్లకు స్టాండింగ్ ఆర్డర్లను రద్దు చేస్తూ ఎక్సిస్టింగ్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, విద్యార్హతల ఆధారంగా కన్వెర్షన్ ఇవ్వాలని, 50 శాతం పీఆర్సీని అమలు చేయాలని తదితర డిమాండ్లతో గత నెల 25న తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్-82, ఈతేహైద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్లు సమ్మెకు దిగాయి. అత్యవసర సేవల విభాగానికి చెందిన విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులు చట్ట ప్రకారం సమ్మె చేయరాదని, సమ్మెకు వెళ్తే చట్టపరమైన చర్యలుంటాయని యాజమాన్యం హెచ్చరించింది. అయినప్పటికీ ఆయా యూనియన్లకు చెందిన కొందరు, ఉద్యోగులు, కార్మికులు, యూనియన్ ప్రతినిధులు సమ్మెకు దిగారు. యాజమాన్యం నిర్ణయాన్ని మార్చుకోకుండా సమ్మెలో పాల్గొన్న వారిపై కొరడా ఝుళిపించి విధుల నుంచి తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ పరిధిలో సమ్మెలో కొనసాగిన ఐదుగురు ఆర్టిజన్లు, ట్రాన్స్‌కో పరిధిలో ఇద్దరు, కేటీపీఎస్ పరిధిలో ముగ్గురు ఆర్టిజన్లను అధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. రాష్ట్ర వ్యాప్తంగా 196 మంది విద్యుత్ ఉద్యోగులు కొలువులు కోల్పోవడంతో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆయా ఉద్యోగుల తరఫున రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసి తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. దీంతో మంత్రి ఆయా ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు సముఖత వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావలసి ఉంది. ఉద్యోగులు తిరిగి నియమించినా ఆదే స్థానాల్లో కొనసాగిస్తారా..? లేదా బదిలీలు ఉంటాయా అనేది చర్చనీయాంశంగా మారింది. పాల్వంచ జెన్‌కోలో పనిచేసే ఉద్యోగులను ఇతర ప్రాంతాల్లోకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం.